
సాక్షి
గుంటూరు
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



నేడు అక్కాయకుంట తిరునాళ్ల

నాదెండ్ల: ఎండుగుంపాలెంలో కొలువైయున్న అక్కాయకుంట సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరగనుంది.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 517.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా వసంత నవరాత్రులు

తెనాలిటౌన్: శరణాగతి గోష్టి పీఠం ట్రస్ట్ నరేంద్ర రామానుజ దాస స్వామిజీ ఆధ్వర్యంలో వసంత నవరాత్రుల ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

హంస వాహనంపై శ్రీలక్ష్మీ నరసింహస్వామి



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్య లక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం స్వామికి హంస వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.

రేపు చిలకలూరిపేటలో పీజీఆర్ఎస్

నరసరావుపేట: వచ్చే సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను చిలకలూరిపేట పట్టణంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు పీజీఆర్ఎస్ ప్రారంభమవుతుందన్నారు. ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నియోజక వర్గాల స్థాయిలో కార్యక్రమం నిర్వహించదలిచినట్లు చెప్పారు. అందులో భాగంగా తొలిసారిగా చిలకలూరిపేట నియోజకవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ అవకాశాన్ని నియోజక ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులతో కలిసి చిలకలూరిపేటలో ఫిర్యాదులు స్వీకరిస్తామని అదే సమయంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సైతం ఫిర్యాదులు స్వీకరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

మే 10న జాతీయ లోక్‌అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 10న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ శనివారం తెలిపారు. అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, బ్యాంక్, రెవెన్యూ, మోటారు వాహన ప్రమాద, చెక్కు బౌన్స్, భరణం, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులు పరిష్కారం అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకొని సమయం, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు.

రేపు పోలీసు వాహనాల విడి భాగాల వేలం


నరసరావుపేట: పల్నాడు పోలీసు కార్యాలయంలో పోలీసు వాహనాలకు సంబంధించి వాడి తీసివేసిన సామగ్రిని ఈనెల ఏడవ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు ఎస్పీ కార్యాలయంలోని మోటారు వాహన కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలనిఆయన కోరారు.

8 నుంచి చైత్రమాస బ్రహ్మోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి చైత్రమాస బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 8వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో ఆది దంపతులకు పలు విశేష వాహన సేవలు జరుగుతాయి. 8వ తేదీ వెండి పల్లకీపై, 9న వెండి రథోత్సవం, 10వ తేదీ రావణ వాహనంపై, 11వ తేదీ నంది వాహనంపై, 12వ తేదీ సింహ వాహనంపై, 13వ తేదీ సాయంత్రం పవిత్ర కృష్ణానదిలో నదీ విహారం ఉంటుంది. ఉత్సవాల్లో తొలిరోజు ప్రత్యేక పూజలు చేస్తారు. 11వ తేదీ రాత్రి 7 గంటలకు మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద రాయబార ఉత్సవం(ఎదుర్కోలు ఉత్సవం) జరుగుతుంది. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు ఆది దంపతుల దివ్య కళ్యాణోత్సవం చేస్తారు. 12వ తేదీ సదస్యం, వేద స్వస్తి, వేదాశీస్సుల కార్యక్రమాన్ని మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తారు. 13వ తేదీ ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్య కోట్నోత్సవం, వసంతోత్సవం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. 14వ తేదీ ద్వాదశ ప్రదక్షిణలు, 15, 16 తేదీల్లో పవళింపు సేవలతో ముగుస్తాయి.

ఉరిమిన వానదేవుడు



గుంటూరు మిర్చి యార్డులో తడిసిన బస్తాను తరలిస్తున్న కూలీ

మండు వేసవిలోనూ వాన దేవుడు రైతులను దెబ్బతీస్తున్నాడు. జిల్లావ్యాప్తంగా కురిసిన అకాల వర్షం రైతుల ఆశలను నిండా ముంచింది. రేయింబవళ్లు చెమటోడ్చి సాగు చేసిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వం సాయం అందక ఇప్పటికే సతమతమవుతున్నాడు. పంటలను అయినకాడికి అమ్ముకోలేక, రేపటి మీద ఆశతో కల్లాల్లోనే నిల్వ చేసుకున్నాడు. గోరుచుట్టు మీద రోకటి పోటు లాగా మాయదారి వాన దాపురించింది. కళ్ల ముందే ధరలు పతనమై మిర్చి రైతు ఇప్పటికే నిరాశలో ఉన్నాడు. అయిన కాడికి అమ్ముకుందామని యార్డులో నిల్వ చేశాడు. అక్కడ కూడా బస్తాలు తడిసిపోవడంతో బేజారెత్తిపోతున్నాడు. సాగు మీద విరక్తితో అన్నదాత 'కాడి' కింద పడేసే స్థితికి చేరాడు.

గుంటూరు జిల్లాలో నష్టపోయిన రైతులు

- పంటలు చేతికందే దశలో అకాల వర్షం
- నేల వాలిన జొన్న, మొక్కజొన్న
- యార్డులో తడిచి ముద్దయిన మిర్చి బస్తాలు
- కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడవడంతో రైతుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, గుంటూరు/కొరిటెపాడు: అకాల వర్షం పంటలను ఆగమాగం చేస్తోంది. జిల్లాలో రబీలో సాగు చేసిన పలు పంటలు చేతికందే దశలో ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి, శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో పలుచోట్ల దెబ్బతిన్నాయి. జిల్లాలో గురువారం రాత్రి 2 గంటల నుంచి వర్షం ప్రారంభమైంది. శనివారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో మొక్కజొన్న, జొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది.

పంటలు నేలపాలు

దుగ్గిరాల, తాడికొండ, తెనాలి, కొల్లిపర, పెదకాకాని, పొన్నూరు, చేబ్రోలు, మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు తదితర మండలాల్లో రైతులు జొన్న, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగు చేశారు. జొన్న, మొక్కజొన్న పంటలు కోత దశకు వచ్చాయి. మిర్చి కోసి కళ్లాల్లో ఆరబెట్టారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అకాల వర్షం కారణంగా జొన్న, మొక్కజొన్న పంటలు నేల పాలయ్యాయి. మిర్చిని విక్రయించేందుకు రైతులు కల్లాల వద్ద ఆరబెట్టగా, వర్షం కారణంగా పలుచోట్ల తడిసి పోయింది. టార్పాలిన్ పట్టాలతో కప్పి కాపాడేందుకు రైతులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

అన్నదాతల్లో ఆందోళన

పంటలు చేతికందుతున్న సమయాన అకాల వర్షాలు కురవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. అప్పు తెచ్చి సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



ఈమనిలో వర్షానికి నేల వాలిన మొక్కజొన్న

గొట్టిపాడులో పిడుగుపాటు

ప్రత్తిపాడు మండలం, గొట్టిపాడు ఆది ఆంధ్రా కాలనీ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇదే సమయంలో తాటి చెట్లపై పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దీంతో క్షణ కాలంలో మంటలు వ్యాపించాయి. ఊహించని ఈ సంఘటనతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదం కలగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కూలిన నాలుగు విద్యుత్ స్తంభాలు

గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డు, ఆంజనేయస్వామి గుడి వద్ద వీధి లైట్ల కోసం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డివైడర్‌పై వేసిన విద్యుత్ స్తంభాల్లో నాలుగు కూలిపోయాయి. ఆ సమయంలో అటువైపుగా వెళ్తున్న ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు పెనుప్రమాదం తప్పింది. ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించడానికి అధికారులు శ్రమించాల్సి వచ్చింది.

మరో రెండు రోజులు వానలు

రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు వివిధ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. గుంటూరు జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది.

యార్డులో తడిచిన మిర్చి బస్తాలు



శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి గుంటూరు మిర్చి యార్డులో బస్తాలు నీటిపాలయ్యాయి. యార్డుకు శని, ఆదివారాలు సెలవులు కావడంతో రైతులు శుక్రవారం సాయంత్రమే గ్రామాలకు వెళ్లిపోయారు. మిర్చి సీజన్ కావడంతో యార్డుకు భారీగా బస్తాలు వస్తున్నాయి. గత రెండు, మూడు రోజుల నుంచి జిల్లాకు వర్ష ప్రభావం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండడంతో రైతులు కూడా చాలా వరకు ముందస్తు జాగ్రత్తగా టార్పాలిన్ పట్టాలు కప్పేసుకుని తమ గ్రామాలకు వెళ్లారు. అయినా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షానికి బస్తాలు తడిచి ముద్దయ్యాయి. అసలే ఈ ఏడాది ధరలు లేక మిర్చి రైతులు అల్లాడుతున్నారు. అకాల వర్షం కారణంగా మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా వారి పరిస్థితి తయారైంది. మిర్చి బస్తాలు తడవడంతో రంగు మారి, ధరలు ఇంకా పతనం అవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పిడుగుపాటుకు పది తాటి చెట్లు దగ్ధం



గుంటూరు రూరల్: పిడుగుపాటుకు పది తాటి చెట్లు దగ్ధమైన సంఘటన శనివారం ప్రత్తిపాడు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం కురిసిన అకాల పిడుగుల వర్షానికి గొట్టిపాడు ఆది ఆంధ్రా కాలనీ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న తాటి చెట్లపై ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడింది. వర్షంలో సైతం తాటి చెట్ల పక్కనే సుమారు పది సెట్ల స్థలంలోని ఇతర చెట్లు కూడా పూర్తిగా కాలిపోయాయి. ఒక్కసారిగా పిడుగుపాటుకు పెద్దగా మంటలు రేగడం, వర్షంలోనూ ఎగిసిపడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కాలనీకి సమీపంలో పిడుగు పడినా ప్రమాదం జరగకపోవడంతో నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు.



మిర్చి తడవకుండా యార్డులో పట్టలు కప్పుతున్న కూలీలు

పేదల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంటరీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

పట్నంబజారు : పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ పనిచేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని పార్టీ గుంటూరు, పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ భారత రాజకీయాలను సైతం ప్రభావితం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కరువు సమయంలో సమన్వయంతో వ్యవహరించి ఎంతో నేర్పుతో పాలన సాగించారని తెలిపారు. ఆయన ఆశయాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసమే జగ్జీవన్‌రామ్ అనుక్షణం పాటుపడ్డారని తెలిపారు. ఆయన ఆశయాలు కొనసాగించడమే మనమిచ్చే ఘన నివాళులు అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మెట్టు వెంకటప్పారెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, నందేటి రాజేష్, మండేపూడి పురుషోత్తం, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, ఎ.వెంకటరెడ్డి, సైదాఖాన్, పదాల సుబ్బారెడ్డి, పి.నాగేశ్వరరావు, పి.మేరి పాల్గొన్నారు.

కప్పం కట్టలేదని ఫ్యాక్టరీలు మూసివేయించారు

- భవ్య, చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీల మూతపై గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని దుశ్చర్యతో రోడ్డున పడిన కార్మిక కుటుంబాలు
- ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని చర్చలు జరపాలి



దాచేపల్లి: తనకు కప్పం కట్టలేదనే దురుద్దేశంతో గురజాల టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు చెట్టినాడ్, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలను మూసివేయించాడని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేకి ముడుపులు చెల్లించలేదని ఫ్యాక్టరీలను మూసివేయడం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు జరగలేదని, యరపతినేని చేస్తున్న దుశ్చర్యలతో వేలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తంగెడలోని భవ్య సిమెంట్స్ గత రెండు నెలలుగా, పెదగార్లపాడులోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ గత 20 రోజులుగా మూతపడటం, ట్రాన్స్‌పోర్ట్ పూర్తిగా నిలిచిపోవడంపై శనివారం ఆయన మాట్లాడారు. చెట్టినాడ్, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలు మూతపడటంపై తాను ఆరా తీశానని, వ్యాపారంలో నష్టాలు రావటం ద్వారా మూసివేశారా అనే కోణంలో ప్రభుత్వ అధికారులు, కార్మికులను ఆరాతీస్తే టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావుకి కప్పం కట్టలేదని ఫ్యాక్టరీలు మూసివేయించారని తనతో చెప్పారని మాజీ ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు.

బస్తాకు రూ.5 నుంచి 20 కప్పం

రెండు ఫ్యాక్టరీలు మూతపడటం వల్ల వేలాదిమంది కార్మికులు కష్టాలు పడుతున్నారని, ఫ్యాక్టరీలను మూసి వేయించడం ఎంత వరకు న్యాయమో ఆలోచన చేయాలని ఆయన కోరారు. బస్తాకి రూ.5 నుంచి రూ.20 కప్పం కట్టాలని సిమెంట్ కంపెనీలకు అల్టిమేటం ఇవ్వడం చరిత్రలో లేదన్నారు. వర్తమానంలో కూడా ఈ సంస్కృతి రాకూడదన్నారు. ఈ రోజు సిమెంట్ ఫ్యాక్టరీలను బెదిరించారని, రేపు సున్నంతో పాటుగా ఇతర వ్యాపారాలు చేసుకునే వ్యాపారులను బెదిరించి కప్పం కట్టమని డిమాండ్ చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ విష సంస్కృతిని కూకటి వేళ్లతో తీసేయాలని, దీనికి ప్రభుత్వంలోని సీఎం నుంచి సీఎస్, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కంకణం కట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాసు తెలిపారు. ఫ్యాక్టరీల యజమానులతో తక్షణమే చర్చలు జరిపి యథావిధిగా కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు మహేష్‌రెడ్డి తెలిపారు.

బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్
- నాటుసారా నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- అక్టోబర్ నుంచి మార్చి చివరి వరకు 1364 కేసులు నమోదు
- 916 మంది అరెస్టు

నెహ్రూనగర్:బహిరంగ మద్యపాన నిషేధానికి పటిష్ఠ చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్ తెలియజేశారు.బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, అచ్చంపేట, నరసరావుపేట, బొల్లాపల్లి మండాల్లోని 28 గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. సమావేశంలో ఏఈఎస్ మారయ్యబాబు, ఎక్సైజ్- 1 టౌన్ సీఐ బి. లత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్, ఏఈఎస్ మారయ్యబాబు

- నవోదయం 2.0 కింద ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి 11 గ్రామాలను నాటుసారా తయారీరహితంగా తీర్చిదిద్దామని చెప్పారు.
- గత ఏడాది అక్టోబర్ నుంచి మార్చి 31వ తేదీ వరకు 1364 కేసులు నమోదు చేసి 916 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 2098 లీటర్ల లిక్కర్, బీరు 99 లీటర్లు, 376 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. దీంతో పాటు 2.35 కేజీల గంజాయి, 8.5గ్రాముల కొకైన్, 14.35గ్రాములు ఎండీఎంఏ, 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.
- 667 బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 669 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1489 లీటర్ల మద్యం, 40లీటర్ల బీరు, నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న 132 మందిని అరెస్టు చేసి 127 కేసులు నమోదు చేశామని వివరించారు. 1002 మందిపై బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

- వివిధ కేసుల్లో లోక్ అదాలత్‌ల ద్వారా 959 కేసుల్లో కాంపౌండ్ ఫీజు కింద రూ.66.60లక్షలు వసూలు అయ్యాయని కమిషనర్ వివరించారు.
- కల్తీ కల్లు నిరోధానికి 117 శాంపిల్స్, బార్‌లో లిక్కర్ నాణ్యతను పరిశీలించేందుకు 158, దుకాణాల్లో మద్యం నాణ్యతను పరిశీలించేందుకు 106 శాంపిల్స్‌ను సేకరించినట్లు తెలిపారు.

కంది రైతులకు 'సౌభాగ్యం'

- మంచి దిగుబడులు ఇస్తున్న సౌభాగ్య రకం కంది విత్తనం
- నూతన వంగడాన్ని రూపొందించిన లాం ఫాం శాస్త్రవేత్తలు
- ఇప్పటికే సాగుచేసి అధిక దిగుబడులు సాధించిన రైతులు
- తెగుళ్లను పూర్తిస్థాయిలో తట్టుకునే రకంగా పేరు

కారెంపూడి: గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (లాంఫాం) శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన కంది రకం ఎల్ఆర్‌జీ 133-33 సౌభాగ్య మంచి దిగుబడుల నిస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లో శాస్త్రవేత్తలు డాక్టర్ సాంబశివ రావు, డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ కేవీ శివారెడ్డి ప్రతి మండలాన్ని దర్శించి సౌభాగ్య నూతన కంది విత్తనాలను ఇచ్చి సాగు చేయాలని రైతులను ప్రోత్సహించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని చర్లగుడిపాడు, కారెంపూడి, దొనకొండ మండలాల్లో 43 మంది రైతులకు ప్రథమశ్రేణి విత్తన కిట్‌లను పంపిణీ చేశారు. ఆ విత్తనాన్ని నీటి పారుదల కింద సాగు చేసిన రైతులకు పది నుంచి గరిష్ఠంగా 17 క్వింటాళ్ల దాకా దిగుబడులు వచ్చాయి. రైతులు చాలా కాలం తర్వాత ప్రైవేటు కంపెనీలకు దీటైన విత్తన దిగుబడులు సౌభాగ్య ద్వారా సాధించారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ విత్తనం రూపకల్పన పూర్వాపరాలపై కథనం.

దక్షిణ భారతానికి అనువైన రకం

ఈ రకాన్ని అప్పటి లాంఫాం అపరాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రాజమణి, డాక్టర్ ఎంవీ రమణ, డాక్టర్ ఎం.శ్రీకాంత్‌లు 2020లో రూపొందించారు. క్షేత్ర పరిశీలన చేసిన కాన్పూర్‌లోని జాతీయ కంది పరిశోధనా స్థానం ఈ రకం విత్తనం దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సాగుకు అనువైనదిగా గుర్తించింది. ఆ తర్వాత నుంచి మన లాంఫాం శాస్త్రవేత్తలు ఈ రకాన్ని తమ పర్యవేక్షణలో సాగు చేస్తూ దిగుబడులు పరిశీలిస్తూ వస్తున్నారు. ఆ తర్వాత 2023 నుంచి తమ భూముల్లో విత్తే విధంగా శాస్త్రవేత్తలు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో పల్నాడు జిల్లాలో సైతం గత ఖరీఫ్‌లో మండలానికి పది మంది రైతులకు ఉచితంగా విత్తనాలిచ్చి పురుగు మందులు కూడా ఇచ్చి సాగుచేయాలని డాక్టర్ సాంబశివరావు తదితరులు ప్రోత్సహించారు. నీటి పారుదల ఉన్న చోట పంట వేసిన వారికి అంతకు ముందున్న ఫేమస్ వెరైటీల కన్నా అధిక దిగుబడులు రావడం క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలు గుర్తించారు.



చర్లగుడిపాడులో రబీలో వేసిన పైరు

తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడి



ఈ రకం ఎండు తెగులును పూర్తిగానూ, వెర్రి తెగులును పాక్షికంగా తట్టుకుంటుంది. ఖరీఫ్, రబీ రెండు కాలాల్లో దీనిని సాగు చేయవచ్చు, ఖరీఫ్‌లో అయితే జూన్, జూలైలో రబీలో అక్టోబరులో వేసుకోవచ్చు. ఖరీఫ్‌లో పెద్ద అచ్చు పెట్టుకోవాలి. రబీలో పత్తి సాగు అచ్చు పెట్టుకోవచ్చు. కాయలు జడలుగా గుత్తులుగా కాస్తాయి. గింజ నాణ్యత బాగుంటుంది. మార్కెట్‌కు బాగా అనుకూలం. ఆకులు, కాయలు ఒకే రంగులో ఉండి కాపు పైకి పెద్దగా కన్పించదు. అయినా దిగుబడి మాత్రం నీటి పారుదల ఉంటే ఎకరాకు పది క్వింటాళ్ల పైనే వస్తుంది. ఖరీఫ్‌లో వర్షాలకు ఒకసారి పూత రాలినా మళ్లీ అదే స్థాయిలో పూత వచ్చి కాపు కాసే రకం.

– డాక్టర్ ఎస్.రాజమణి, విత్తనం ప్రధాన రూపకర్త

సౌభాగ్య పంట మెరుగ్గా ఉంది

నేను నాలుగెకరాలలో సౌభాగ్య రకం కంది అక్టోబరులో వేశాను. కోసి కల్లం చేస్తున్నాను. పది క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా. ఏడున్నర ఎకరాల చేలో సౌభాగ్య విత్తనంతో పాటు మరో టాప్ కంపెనీ విత్తనం కూడా వేశాను. సౌభాగ్య పంటే మెరుగ్గా ఉంది. మంచి దిగుబడి కూడా వస్తుందని ఆశిస్తున్నా. రబీలో వేసినా ఎత్తు బాగా పెరుగుతోందని తలలు కట్ చేయించా. ఒకసారి బెట్టకు వచ్చిన తర్వాత నీరు పెట్టడంలో జాప్యం జరిగి పూత రాలిపోయినా తర్వాత మళ్లీ వచ్చి కాసింది. రైతులు వేసుకోదగిన విత్తనం.

– శిరసనగండ్ల శ్రీనివాసాచారి, రైతు, చర్లగుడి

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **7,500** గరిష్టం : రూ. **10,000**

మోడల్ ధర రూ. **8,500**

క్లుప్తంగా

వైద్య కళాశాల ల్యాబ్‌ను పరిశీలించిన కేంద్ర బృందం



గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లాలో రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో మృతి చెందడంతో నిర్ధారణ చేసేందుకు రెండు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేంద్రం బృందం పర్యటిస్తోంది. పల్నాడు జిల్లాలో ఒక రోజు, మంగళగిరి ఎయిమ్స్‌లో మరోరోజు పరిశీలన అనంతరం మూడోరోజు శనివారం గుంటూరు వైద్య కళాశాలకు వచ్చింది. కళాశాలలోని వైరాలజీ ల్యాబ్ (వీఆర్‌డీఎల్)ను సభ్యులు పరిశీలించారు. నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులు తొమ్మిది మందికి గుంటూరు వైద్య కళాశాల ల్యాబ్‌లో శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ల్యాబ్‌లో వసతులు, వారికి చేసిన వైద్య పరీక్షల గురించి మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాణిశ్రీని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ నిర్వహణ, పనితీరు, వైద్య పరికరాలు, సిబ్బంది గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బృందంలో ఐడీఎస్‌పీ ఏపీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ భార్గవి రాజ్, ఎన్‌సీడీసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంకూర్ గార్గ్, ఎన్‌సీడీసీ మైక్రోబయాలజిస్ట్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నిధి షైని, ఎయిమ్స్ మంగళగిరి పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్ర, ముంబాయి ఐసీఎస్ఆర్ సైంటిస్ట్ డాక్టర్ శైలేష్ పవర్ ఉన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ కృషి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కాంక్షించిన జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలని జెడ్పీ సీఈవో కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. జెడ్పీ కార్యాలయంలో శనివారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో వి. జ్యోతి బసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెనీ క్రిస్టినా మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగులందరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళి

గుంటూరు లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలోని గుంటూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమానికి గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగళశెట్టి శివ సూర్య నారాయణ అధ్యక్షత వహించారు. ఏపీ హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఈవెన సాంబశివ ప్రసాద్, నాలుగవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుకుమార్, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ న్యాయవాదులు పాల్గొన్నారు

బాబూజీని ఆదర్శంగా తీసుకోవాలి

ఏఎన్‌యూ: క్రమశిక్షణ, లక్ష్య సాధనలో బాబూ జగ్జీవన్‌రామ్‌ను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ రోడ్ సేఫ్టీ విభాగ డీఐజీ సీహెచ్. విజయారావు తెలిపారు. నాగార్జున యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జయంతి వేడుకలు నిర్వహించారు. డీఐజీ విజయారావు ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని అవాంతరాలను అధిగమించి అత్యున్నత స్థాయికి చేరి జగ్జీవన్‌రామ్ అందరికీ ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులంతా ఆయన బాటలో నడవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్, పూలే, అంబేడ్కర్ వంటి అహనీయుల సేవలు, ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయనకేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థిగా, సామాజిక ఉద్యమాల నాయకుడిగా, రాజకీయ నేతగా, ప్రజాప్రతినిధిగా జగ్జీవన్‌రామ్ విలక్షణమైన ప్రతిభను కనబరిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్, పూలే అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు వై. అశోక్ కుమార్, ఎం. త్రిమూర్తిరావు, యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ పి. బ్రహ్మజీరావు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఎం. సుబ్బారావు, బాలుర వసతి గృహాల వార్డెన్ ఆచార్య మల్లికార్జున, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ కృష్ణారావు పాల్గొన్నారు.



జెడ్పీలో నివాళులర్పిస్తున్న హెనీ క్రిస్టినా, సీఈవో జ్యోతిబసు తదితరులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ పోరాటం

నగరంపాలెం: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తాత్కాలిక మేయర్ షేక్ సజీల జ్యోతి ప్రజ్వలన చేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో కూటమి ప్రభుత్వం నడుస్తోందని తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ మహనీయుల జీవితాలను పిల్లలు ఆదర్శంగా తీసుకుని ఎదిగేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందని చెప్పారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ మాట్లాడుతూ బిహార్‌లోని మారుమూల గ్రామంలో జన్మించి, ఉప ప్రధాని స్థాయికి ఎదిగి జగ్జీవన్‌రామ్ చరిత్ర సృష్టించారని అన్నారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అమరావతిలో 125 అడుగుల విగ్రహాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఆర్‌ఓ ఖాజావలి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, కార్పొరేటర్ పోతురాజు సమత, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఏపీ రోడ్డు సేఫ్టీ డీఐజీ విజయారావు తదితరులు

అలరించిన శ్రీరామ గానా మృతం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్త నారద గాన సభ ఆధ్వర్యంలో శనివారం శ్రీరామ గానా మృతం నిర్వహించారు. కార్యక్రమాన్ని విశ్రాంత అదనపు ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ, సంగీత విద్వాంసులు కె.వి.బ్రహ్మానందం, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య పాహి రామప్రభో, రామచంద్రుడితు రఘువీరుడు, ననుబ్రోవమని చెప్పవే, సీతా కళ్యాణ వైభోగమే అంటూ పలు భక్తి గీతాలను రమ్యంగా ఆలపించారు. సభికులను అలరించాయి. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయశాస్త్రి, మృదంగంపై కాకరపర్తి జగన్మోహిని వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

కుటుంబ సభ్యుల చెంతకు చేరిన వృద్ధుడు

తాడేపల్లి రూరల్: ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు చేరాడు. ప్రకాశం జిల్లాకు చెందిన వృద్ధుడు దారితప్పి తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లికి చేరుకోవడంతో స్థానికులు ఆశ్రయమిచ్చిన సంగతి తెలిసిందే. తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య వృద్ధుడిని శుక్రవారం తాడేపల్లి ఆశ్రమానికి తరలించి, కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. కుంచనపల్లిలో ఉన్నారని సిబ్బంది ద్వారా సమాచారం రావడంతో శనివారం వారిని పిలిపించి అప్పగించారు. దీంతో వృద్ధుడి కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేలకొరిగిన నాలుగు విద్యుత్ స్తంభాలు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు నగరంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి అమరావతి రోడ్ ఆంజనేయస్వామి గుడి వద్ద వీధి లైట్ల కోసం వేసిన నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో తక్షణమే సరఫరా నిలిపివేశారు. స్తంభాలు కూలడంతో అమరావతి రోడ్‌లో ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సంబంధిత అధికారులు అప్రమత్తమై ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటేశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్తంభాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్



వినుకొండ: వక్ఫ్ సవరణ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించి ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు, జమైత్ - ఉల్ - ఉలేమా, జమైత్ ఇస్లాం-ఎ-హింద్ సహా పలు మైనార్టీ సంస్థలు అనేక అభ్యంతరాలను వ్యక్తం చేశాయన్నారు. దేశంలో 14.6 శాతం ఉన్న ముస్లింల అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఆర్టికల్ 14, 25, 26లను ఉల్లంఘిస్తుందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణ కలెక్టర్లకు అప్పగించడం, వక్ఫ్‌బోర్డులో అన్యమత సభ్యులను నియమించడం, వక్ఫ్ ఆస్తులు 12 ఏళ్లుగా ఎవరి అధీనంలో ఉంటే వారివే అనడం, 300 ఏళ్ల క్రితం నాటి ఆస్తులకు ఇప్పుడు డాక్యుమెంట్లు అడగడం.. ఇవన్నీ ముస్లింల మనోభావాలను దెబ్బతీసే వ్యతిరేక చర్యలు అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఈ బిల్లును వ్యతిరేకించిందని గుర్తు చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన చంద్రబాబు ఒక ముస్లిం ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. కౌన్సిలర్లు గౌస్‌బాషా, షేక్ రఫీ, మైనార్టీ నాయకులు హఫీజ్, గౌస్‌బాషా, హిప్పీ, జాని, అయాజ్, అమీర్, రబ్బానీ పాల్గొన్నారు.

నంద్యాల, సూర్యాపేట ఎడ్లకు ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి బుల్లెట్ బైక్‌ను అందుకుంటున్న ఎడ్ల జత ప్రతినిధి

తెనాలి రూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశుపాల ప్రదర్శన పోటీలు ముగిశాయి. గత నెల 29వ తేదీ నుంచి జరుగుతున్న పోటీల్లో చివరి రోజైన శుక్రవారం సీనియర్స్ విభాగం పోటీలు నిర్వహించారు. 11 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. రాత్రి పొద్దు పోయే వరకు హోరాహోరీగా పోటీలు జరిగాయి. నంద్యాల జిల్లా పెదకొట్టలకు చెందిన జోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ జిల్లా సూర్యాపేటకు చెందిన ఏఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డి కంబైన్డ్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3619.9 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి.తాడేపల్లికి చెందిన లంకిరెడ్డి నిక్షేత్‌రెడ్డి ఎడ్ల జత(3394.10 అడుగులు) రెండో బహుమతిని, ప్రత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత (3351.8 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా బుల్లెట్ బండిని అందజేశారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు.

నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ

నగరంపాలెం: రౌడీషీటర్లు, ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో శనివారం కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల (పీఎస్)కు సంబంధించి న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలని సూచించారు. ఆయా పీఎస్‌ల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, సాక్ష్యాధారాలు సమర్పించాలని తెలిపారు. పలు కేసుల్లోని ముద్దాయిలు, రౌడీషీటర్ల హాజరు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లపై శ్రద్ధ వహించాలని చెప్పారు. ముద్దాయిల జాడ తెలియకపోతే ష్యూరిటీలను కోర్టుకు హాజరుపరచాలని సూచించారు. హత్య, హత్యాయత్నం, ఎన్‌డీపీఎస్, పోక్సో, అత్యాచార కేసుల్లో నేరాలకు సంబంధించి విచారణను సంబంధిత కోర్టులో త్వరితగతిన జరిగేలా చేయాలని ఆదేశించారు. గత నెలలో ఆయా న్యాయస్థానాల్లో పలు కేసులకు సంబంధించి వెలువరించిన తీర్పులు, నిందితులకు విధించిన శిక్షలపై సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. శిక్షల విధింపులో మరింత కృషి చేస్తే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని కట్టడి చేయవచ్చునని సూచించారు. సమావేశంలో డీసీఆర్‌బీ-2 సీఐ బి.నరసింహారావు, పీఎస్‌ల కోర్టు ఏఎస్ఐలు, హెస్‌సీలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


విలువలతో కూడిన బోధనతో విద్యార్థుల్లో వికాసం



శ్రీ చైతన్య వార్షికోత్సవంలో కమిషనర్ శ్రీనివాసులుతో దుర్గాప్రసాద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన బోధనతో విద్యార్థుల్లో సమగ్ర వికాసాన్ని అభివృద్ధి పర్చగలమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. రింగ్ రోడ్డులోని శ్రీ చైతన్య సీవో-ఐపీఎల్ పాఠశాల ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు మాట్లాడుతూ సాంకేతిక విద్యా బోధనకు శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో సీవో-ఐపీఎల్ పాఠశాలలను నెలకొల్పడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో సమాజంలో మెలుగుతూ దేశభక్తిని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్ శివకుమార్, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎం విద్యార్థికి 'బెస్ట్ పేపర్ ఇన్ ట్రాక్' అవార్డు



అవార్డు అందుకున్న సయ్యదాహఫ్సా

నగరి : గుంటూరు జిల్లాలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, పారిస్కూల్ ఆఫ్ బిజినెస్‌లో సెకండ్ ఇయర్ పీహెచ్‌డీ చదువుతున్న సయ్యదాహఫ్సా అనే విద్యార్థికి 'బెస్ట్ పేపర్ ఇన్ ట్రాక్ అవార్డు' దక్కింది. గత నెల 21వ తేదీన బిట్స్ పిలానీ క్యాంపస్ నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎవిడెన్స్ బేస్డ్ మేనేజ్‌మెంట్ (ఐసీఈబీఎం)లో పాల్గొన్న ఆమె 'బియాండ్ ది డెస్క్: ఫ్యూయలింగ్ డిజిటల్ ఇన్నోవేషన్ త్రూ వర్క్‌ప్లేస్ ఫ్లెక్సిబిలిటీ' అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు గాను ఆమెకు 'బెస్ట్ పేపర్ ఇన్ ట్రాక్ అవార్డు' ప్రదానం చేశారు. కాగా ఆమె భర్త షేక్ సలీమ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్‌గా ఉన్నారు. కళాశాల డీన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఎఆర్ఎం పీఎస్‌బీలు అందించిన మద్దతు, మార్గదర్శకత్వంతోనే అవార్డు సాధించగలిగానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. విలువైన సలహాలు సూచనలు అందించిన డాక్టర్ జుమాన్ ఇక్బాల్‌కు, ప్రోత్సాహం అందించిన కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.